# అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

పొదలకూరు: అకాల వర్షంతో అన్నదాతలు వణికి పోతున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పొదలకూరు మండలంలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లోని రైతులు పంట నూర్పిళ్లు చేపట్టి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో భారీగా వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో రెండ్రోజులుగా వడగళ్ల వానలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోనూ అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు హడావుడిగా వరి కోతలకు సిద్ధపడుతున్నారు. మరో వారం రోజులు ఆగితే నూర్పిళ్లు పూర్తవుతాయి. శుక్రవారం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షం కురిస్తే వరి పంట నేలవాలి ధాన్యం నేల రాలుతుందని రైతులు బెంబేలెత్తుతున్నారు.

**వరికోత మెషిన్లకు డిమాండ్**

మండలంలో 10,500 ఎకరాల్లో వరిసాగు చేశారు.. అత్యధికంగా తెలంగాణ మసూరి రకాన్ని నాటారు. ముందుగా వరిసాగు చేసిన రైతులు కోతలు చేపడుతుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన వారు ఏప్రిల్ రెండోవారం నుంచి కోతలు చేపట్టనున్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధరలు ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. వర్ష సూచనతో రైతులు ఒక్కసారిగా నూర్పిళ్లకు సిద్ధమవడంతో వరికోత యంత్రాలకు డిమాండ్ పెరిగినట్లుగా రైతులు చెబుతు న్నారు. ప్రస్తుతం వరి కోత మెషిన్‌కు గంటకు రూ.2,400 అద్దె తీసుకుంటున్నారు. వర్ష సూచన నేపథ్యంలో వరి కోత మెషిన్లకు డిమాండ్ పెరగడంతో అద్దెను పెంచుతున్నారని రైతులు వెల్లడించారు.

వెంకటాచలం: మండలంలోని కనుపూరు కెనాల్ ఆయుకట్టు కింద ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలు సాగుతున్నాయి. రెండ్రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జోరు వర్షం కురిస్తే కోతకు వచ్చిన పంట నేలపాలవుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నూర్పిళ్లు చేపట్టి ధాన్యాన్ని ఆరబోసుకున్న రైతులు తడిచిపోకుండా పట్టలు కప్పి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



వెంకటాచలం: తిక్కవరప్పాడులో ఆరబోసిన ధాన్యం తడిసిపోకుండా పట్టలు కప్పిపెట్టిన దృశ్యం



పొదలకూరులో కోతకు వచ్చిన వరిపంట

# ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

కొడవలూరు: వేసవిలో ఉపాధి కూలీలను సంఖ్యను గణనీయంగా పెంచాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఏపీఓలు, టీఏలు, ఎఫ్ఏలతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కూలీకి విధిగా వంద రోజుల పని కల్పించాలన్నారు. ప్రతీ పంచాయతీలో విధిగా పనులు గుర్తించి చేపట్టాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయాన్నే కూలీలు పనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల్లోగా కూలీలు పని ముగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేసవి వ్యవసాయ పనులు లేనందున ప్రతీ కూలీకి ఉపాధి పనులు కల్పించేలా కృషి చేయాలని కోరారు.



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీడీ మృదుల

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వెంకటాచలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. మొత్తం 324 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 323 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించనున్నారు.

**ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన**

కోవూరు: స్థానిక టీఎస్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని రామాయపట్నం పోర్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టీ పద్మావతి శుక్రవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోని అన్ని గదులను క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యానికి గురవకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు.

**ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు**

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీహరి, గయాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు సంబంధించి ఏ సెంటర్‌లో 270 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 20 మంది గైర్హాజరయ్యారు. అలాగే బీ సెంటర్‌లో 253 మంది హాజరుకావాల్సి ఉండగా, 15 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి కృష్ణప్రసాద్ తెలిపారు.



కోవూరు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి

# నిత్యాన్నదానానికి రూ.50,500 విరాళం

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన దాతలు శుక్రవారం రూ.50,500 విరాళంగా అందజేశారు. దాతలు శివకుమార్ రెడ్డి, మేఘన దంపతులు తమ పిల్లలు హేయాన్ష్, హిరానికా పేరు మీదుగా అన్నదానానికి నగదును అందజేసినట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలో సైతం రూ.లక్ష నగదును కానుకగా వేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



ఆలయ చైర్మన్‌కు నగదు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

## నేడు శ్రీవారి కల్యాణం

పొదలకూరు : శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## ఇన్‌చార్జి ఎంఈఓగా మధుసూదన్

పొదలకూరు : మండల ఇన్‌చార్జి ఎంఈఓగా ముత్తుకూరు ఎంఈఓ మధుసూదన్‌ను నియమించారు. మండల ఇన్‌చార్జి ఎంఈఓగా పనిచేస్తున్న కలువాయి ఎంఈఓ సుధీర్‌బాబు డిప్యుటేషన్‌పై సర్వశిక్ష ఏఎంఓగా వెళ్లారు. అప్పట్నుంచి ఎంఈఓ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మధుసూదన్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో సూరాయపాళెంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం మధుసూదన్‌కు ఉందని తెలిసింది.

## షఫీఉల్లాకు సన్మానం



ముత్తుకూరు: స్థానిక పెద్ద మసీదులో జాతీయ మైనార్టీ కమిషన్ సలహాసభ్యుడిగా నియమితులైన అబ్దుల్ షఫీఉల్లాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముస్లిం మైనార్టీ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మైనార్టీ కమిషన్ పటిష్టంగా పనిచేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మసీదు కమిటీ పెద్దలు మన్నన్, షౌకత్, మహబూబ్‌బాషా, రిజ్వాన్, ఇబాదుల్లా, రషీద్, రఫీ, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## బాలుడిపై దాడి

నెల్లూరు(క్రైమ్): బాలుడిపై దాడి చేసిన ఘటనలో ఆటో డ్రైవర్‌పై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మైపాడు రోడ్డు వేణుగోపాల్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు యశ్వంత్ పానీపూరి తినేందుకు గానూ ప్రశాంతినగర్‌కు గురువారం రాత్రి వెళ్లారు. పక్కనే ఉన్న ఆటోలో కూర్చొని పానీపూరి తింటుండగా డ్రైవర్ నాగూర్ కొట్టడంతో గాయపడ్డారు. ఈ మేరకు బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీల ఏర్పాటు



యల్లాయపాలెం ప్రాథమిక పాఠశాలలో బెంచీలను అమరుస్తున్న దృశ్యం



నార్తురాజుపాళెం సీబీఎన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బెంచీల ఏర్పాటు

కొడవలూరు: మండలంలో 'నాడు–నేడు' రెండో విడత కింద ఎంపికైన 19 ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలను సరఫరా చేశారు. వీటిని ఆయా పాఠశాలల్లో శరవేగంగా అమర్చుతున్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు దగ్గరుండి పాఠశాలల్లో సౌకర్యవంతంగా బెంచీలను అమర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ జీ వసంత కుమారి మాట్లాడుతూ నాడు–నేడు మొదటి విడత కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇప్పటికే బెంచీలు ఏర్పాటు పూర్తయిందన్నారు. రెండో విడత కింద ఎంపికై న బెంచీల అమరిక శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండ్రోజుల్లోనే అన్ని పాఠశాలల్లో బెంచీలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. విద్యార్థులకు బెంచీలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటున్నాయన్నారు. నాడు–నేడు రెండో విడత పనులు సంబంధించి 19 పాఠశాలలకు రెండో విడత రివాల్వింగ్ ఫండ్‌ను ప్రభుత్వం విడుదల చేసినందున పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించామన్నారు.

# ఖురాన్‌తో సన్మార్గంలో పయనం

బుచ్చిరెడ్డిపాళెం: పవిత్ర ఖురాన్‌ను చదవడం ద్వారా సన్మార్గంలో పయనించవచ్చని యునైటెడ్ ముస్లిం మైనార్టీ ఫెడరేషన్ రాష్ట్రాధ్యక్షుడు రఫీ పేర్కొన్నారు. స్థానిక షాదీమంజిల్‌లో యునైటెడ్ ముస్లిం మైనార్టీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి దివ్య ఖురాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖురాన్‌ను భక్తిశ్రద్ధలతో చదవడం వల్ల పుణ్యం లభిస్తుందన్నారు. అనంతరం ఖురాన్ గ్రంథాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు అల్లాభక్షు, నగర పంచాయతీ వైస్‌చైర్‌పర్సన్ షాహుల్, ముస్లింలు సర్దార్, మౌలానా, అహ్మద్, ఇమామ్, అమీన్, సంధానీ, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: ఖురాన్ గ్రంథాన్ని అందజేస్తున్న దృశ్యం

# ఎన్జీఓ మహిళా విభాగంలో ఇద్దరికి చోటు

నెల్లూరు(బారకాసు): ఆర్ అండ్ బీలో పనిచేస్తున్న ఇద్దరికి ఎన్జీఓ మహిళా విభాగంలో చోటు లభించింది. సర్కిల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీలక్ష్మి ఎన్జీఓ మహిళా విభాగంలో సిటీ కో చైర్‌పర్సన్‌గా, నెల్లూరు డివిజన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మి జిల్లా జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. వీరిని సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ గంగాధర్, డిప్యూటీ ఎస్ఈ సురేష్‌బాబు సత్కరించారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నేతలు శరత్‌బాబు, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న గంగాధర్, తదితరులు

# క్రీడాకారులకు వైద్య శిబిరం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మహిళా క్రీడాకారులకు ఆయుర్వేదం, న్యాచురోపతి, హోమియో వైద్య శిబిరాన్ని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆయుష్ సహకారంతో శుక్రవారం నిర్వహించారు. సెట్నెల్, డీఎస్ఏ ముఖ్య కార్యనిర్వహణాధికారి పుల్లయ్య, డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య ప్రారంభించారు. ఆయుర్వేద చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 వరకు ఏసీ స్టేడియంలో మహిళా క్రీడాకారులకు క్రీడా పోటీలతో పాటు యోగా, వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

# గిరిజనులకు దుస్తుల పంపిణీ

మనుబోలు: మడమనూరులోని గిరిజనులకు పీపుల్స్ వెల్ఫేర్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పోతేగుంట మల్లికార్జునరావు మాట్లాడుతూ సమాజంలో వెనకబడి ఉన్న పేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతో ట్రస్ట్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా నేటికి గిరిజనులు అన్ని రకాలుగా వెనకబడి ఉన్నారన్నారు. గిరిజన పిల్లలకు చదువు లేకపోవడంతో వారిలో చైతన్యం కొరవడుతోందన్నారు. పిల్లలను చదివించాలని సూచించారు. గిరిజనుల అభివృద్ధికి తమ ట్రస్ట్ ద్వారా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

# 23 నుంచి జర్నలిస్టుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని జర్నలిస్టులకు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నామని నుడా చైర్మన్, జేశాప్ జిల్లా గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పోటీల్లో 12 జట్లు పాల్గొననున్నాయని, నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. విజేతలకు బహుమతులతో పాటు క్రీడాకారులకు క్రీడా దుస్తులు, భోజన వసతిని కల్పించనున్నామని పేర్కొన్నారు. సెట్నెల్, డీఎస్ఏ సీఈఓ పుల్లయ్య, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోటారెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్, జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందకిషోర్, రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా కార్యదర్శి సునీల్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ద్వారకానాథ్

# ఉగాది పురస్కారాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని పురమందిరంలో ఆదివారం నిర్వహించనున్నామని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరిబాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ఈ ఏడాది పురస్కారాలను 12 మందికి అందజేయనున్నామని వివరించారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. 25 కళాసంఘాల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, రాజు, చిట్టిబాబు, నారాయణబాబు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## కామాక్షితాయి సేవలో ఆడిట్ డీడీ

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని రాష్ట్ర ఆడిట్‌శాఖ జోన్–3 ఒంగోలు రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కే నాగశ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. క్షేత్రంలోని గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



## నిరుద్యోగ యువతకు ఉపాధికోర్సుల్లో శిక్షణ

పొదలకూరు : పీఎంకేవీవై ద్వారా వేసవి సెలవుల్లో 15 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగులకు ఉచితంగా ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పొదలకూరు(చిట్టేపల్లి) ఐటీఐ ప్రిన్సిపల్ బీ మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన వారికి మూడు నెలల కాలవ్యవధిలో సూయింగ్ మెషిన్ ఆపరేటింగ్, బార్‌బెండర్, స్టీల్‌ఫిక్సర్ కోర్సుల్లో, 8, 10 తరగతులు ఉత్తీర్ణులైన వారికి జామ్ జెల్లీ, కెచప్ ప్రాసెసింగ్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణానంతరం నూరుశాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు బయోడెటా, విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పాసు పుస్తకం, నాలుగు పాస్ ఫొటోలతో ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99484 20477, 88868 86144, 89851 19940, 81850 88996 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## క్లుప్తంగా

### అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసిన ఘటనపై దిశ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన లావణ్యకు నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్క్‌కు చెందిన కల్యాణ్‌తో 2019లో వివాహమైంది. వివాహ సమయంలో కల్యాణ్ కుటుంబానికి భారీగా కట్న కానుకలను లావణ్య తల్లిదండ్రులు ఇచ్చారు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కల్యాణ్ పనికెళ్లడం మానేయడంతో కుటుంబపోషణ కష్టతరంగా మారింది. దీంతో లావణ్య టైలరింగ్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచారు. తాజాగా రూ.మూడు లక్షల అదనపు కట్నాన్ని తీసుకురావాలంటూ ఆమెపై భర్త, అత్తింటివారు ఒత్తిడి తెచ్చారు. వారి వేధింపులను తాళలేని ఆమె జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసి వారి వద్దకు వెళ్లారు. పెద్ద మనుషుల ద్వారా కాపురాన్ని చక్కదిద్దేందుకు యత్నించినా ప్రయోజనం లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు.

### పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): ఉగాది పురస్కారాలకు వివిధ రంగాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జీవన యోగశాల ఆరోగ్య సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్క్‌లో పురస్కారాలను బుధవారం అందజేయనున్నామని పేర్కొన్నారు. వివరాలకు 88856 68752, 93914 91052 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### మాల మహానాడు సమావేశం నేడు

నెల్లూరు (వేదాయపాళెం): దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు ఆత్మీయ సమావేశాన్ని శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్ హాజరుకానున్నారని చెప్పారు. కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### రవాణా అధికారుల నిరసన



నెల్లూరు (టౌన్): వాహన పన్ను చెల్లించాలని కోరిన కాకినాడ ఏఎమ్వీఐ చిన్నారావుపై వాహన యజమాని దాడి చేయడం దురదృష్టకరమని నెల్లూరు డీటీసీ చందర్ పేర్కొన్నారు. ఏఎమ్వీఐపై దాడికి నిరసనగా జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఎదుట రవాణా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసనను శుక్రవారం చేపట్టారు. రవాణా అధికారులపై దాడులకు పాల్పడటం హేయమన్నారు.

### సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(బారకాసు): ఆర్అండ్‌బీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా వైస్ చైర్మన్ శరత్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని ఆర్ అండ్ బీ సర్కిల్ కార్యాలయం ఎదుట తమ నిరసనను శుక్రవారం తెలియజేశారు. జేఏసీ నేతలు మస్తానయ్య, సురేష్, నవీన్, ఎన్జీఓ మహిళా విభాగానికి చెందిన జిల్లా కన్వీనర్ లక్ష్మి, సిటీ కో చైర్‌పర్సన్ లక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్ జాకీర్‌హుస్సేన్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టండి



నెల్లూరు సిటీ: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా కార్పొరేషన్ పరిధిలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఎన్సీఏపీ నిధులతో చేపట్టే అంశంపై సమీక్షించారు.